# గంజాయి రహిత జిల్లాగా మార్చుతాం



సిద్దిపేటలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు

- 2023లో 7 శాతం పెరిగిన నేరాలు
- 5,931 కేసులు నమోదు
- అడిషనల్ డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాసరావు
- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదిక విడుదల

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 29 : సిద్దిపేటను గంజాయి రహిత జిల్లాగా మార్చుతామని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట కమిషనరేట్‌లో పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదిక-2023ను అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 సంవత్సరంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 5931 కేసులు నమోదయ్యాయని, ఈ సంవత్సరం 7శాతం నేరాలు పెరిగాయని వివరించారు. ఈ సంవత్సరం 13 మర్డర్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈ ఏడాది 31.5శాతం నేరాలు తగ్గాయన్నారు. 670 చోరీ కేసులు నమోదు కాగా, 89పోక్సో కేసులు నమోదైనట్లు తెలిపారు. 15శాతం పోక్సో కేసులు పెరిగాయన్నారు. లైంగికదాడి కేసులు 73 నమోదైనట్లు తెలిపారు. 5 చైన్‌స్నాచింగ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. 61.5శాతం చైన్‌స్నాచింగ్ తగ్గాయన్నారు. 540 రోడ్డు ప్రమాదాలు కేసులు నమోదైనట్లు చెప్పారు. 260 మంది చనిపోగా, 480మందికి గాయాలైనట్లు తెలిపారు. ఈ ఏడాది 3.7 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గినట్లు తెలిపారు. 4.4శాతం మరణాల రేటు తగ్గాయని వివరించారు. ఈ సంవత్సరం 26శాతం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 9713 కేసులు నమోదు చేసి, 28మందిని జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. 14 గంజాయి కేసులు నమోదైనట్లు తెలిపారు. వాహనాలపై స్పీడ్ లేజర్ గన్ ద్వారా ఈ ఏడాది 86,533 కేసులు నమోదు చేసి 8,95,24,145 జరిమానా విధించినట్లు తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల్లో నేరస్తులకు 47శాతం శిక్షలు విధించినట్లు పేర్కొన్నారు. 3 కేసుల్లో నలుగురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 234 సైబర్ కేసులు నమోదైనట్లు తెలిపారు. 148 కేసుల్లో 1,04,03,871 డబ్బులు ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు. ఈ సంవత్సరం బైండోవర్ కేసులు 2944 నమోదు కాగా, 2983 మందిని బైండోవర్ చేశారు. ఈ ఏడాదిలో పేకాట ఆడిన వారిపై 26 కేసులు నమోదు చేసి 162 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 8225 (ఈ పెట్టి) కేసులు, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన వారిపై 4,922 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

### 7015 సీసీ కెమెరాలు ఏర్పాటు..

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 499 గ్రామ పంచాయతీలు, 5 మున్సిపాలిటీల్లో 7015 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా వివిధ రకాల (32) కేసులను ఛేదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు రమేశ్, సతీశ్, సురేందర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### -సిద్దిపేట జిల్లా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాసరావు

చేర్యాల, డిసెంబర్ 29 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాసరావు అన్నారు. జనవరి 7వ తేదీన జరిగే మల్లన్న కల్యాణం సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన కొమురవెల్లిలో మల్లన్న కల్యాణం నిర్వహించే తోటబావి ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రదేశాలు, శీఘ్రదర్శనం, వీఐపీ దర్శనం, సాధారణ దర్శన ప్రదేశాలను పరిశీలించారు. తోటబావి సమీపంలో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, సిద్దిపేట, గజ్వేల్ ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, తిరుపతి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఉన్నారు.

## పర్యావరణ పరిపరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి



రామాయంపేట ఆవాస విద్యాలయానికి చేరుకున్న సైకిల్ యాత్ర

రామాయంపేట, డిసెంబర్ 29 : దేశ వ్యాప్తంగా రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతున్నదని, కాలుష్య నివారణకు యువకుల్లో ఉత్తేజాన్ని నింపడం కోసం సైకిల్ యాత్ర చేపడుతున్నానని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాబిన్‌సింగ్ తెలిపారు. గురువారం రాత్రి ఉత్తరప్రదేశ్ నుంచి బయలు దేరిన సైకిల్ యాత్ర హైదరాబాద్ అల్వాల్ మీదుగా రామాయంపేటకు చేరుకున్నది. సైకిల్ యాత్ర చేపట్టిన యువకుడిని రామాయంపేట ఆవాస విద్యాలయంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యం, కార్యదర్శి మల్లేశం స్వాగతం పలికారు. శుక్రవారం రాబిన్‌సింగ్ విలేకరులతో మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ కాలుష్యాన్ని తరిమి కొట్టాలన్నారు. ఇప్పటి వరకు 26వేల కిలోమీటర్ల మేర రామాయంపేటకు సైకిల్ యాత్ర చేపట్టానని తెలిపారు. తన స్వగ్రామం చేరే వరకు సైకిల్‌పై వెళ్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో యువకులకు అవగాహన కల్పిస్తానని రాబిన్‌సింగ్ తెలిపారు.

## ప్రజా పాలన పకడ్బందీగా చేపట్టాలి

అందోల్/సదాశివపేట/జహీరాబాద్, డిసెంబర్ 29 : ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టర్ శరత్ అన్నారు. శుక్రవారం అందోల్, సదాశివపేట మండలంలోని ఆరూర్, జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియం, శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కౌంటర్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవోలు పాండు, వెంకారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్లు తిరుపతి, సుభాశ్‌రావు, ఎంపీడీవో పూజ, సర్పంచ్ మధు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అందోల్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ శరత్

## మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు

- అవుట్ డోర్ ఈవెంట్లలో డీజేలకు అనుమతి నో
- ప్రైవేట్ ఈవెంట్స్, పార్టీలకు అనుమతి తప్పనిసరి
- ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్



సంగారెడ్డి, డిసెంబర్ 29 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ శుక్రవారం ఒకప్రకటనలో హెచ్చరించారు. అవుట్ డోర్ ఈవెంట్లలో డీజేలకు అనుమతి లేదని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ ఈవెంట్స్, పార్టీలకు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రతా పరమైన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రైవేట్ ఈవెంట్స్, పార్టీలకు జిల్లా పోలీసు శాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ నెల 31 నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. గడిచిన సంవత్సరం నుంచి కొత్త పాఠాలు నేర్చుకుని కొత్త ఆశలతో నూతన సంవత్సరం-2024లోకి అడుగుపెట్టాలని, వివాదాలకు తావులేకుండా కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ జిల్లా ప్రజలను కోరారు.



గజ్వేల్‌లో ఆటోలతో నిరసన ర్యాలీ

## గజ్వేల్‌లో ఆటోడ్రైవర్ల ఆందోళన

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 29 : మహాలక్ష్మి పథకంతో తమ బతుకులు ఆగమయ్యాయని, ప్రభుత్వం నెలకు రూ.15వేల చొప్పున జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఆటోకార్మికులు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గంలోని ఆటోకార్మికులు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఐవోసీ పక్కన మైదానం నుంచి ప్రజ్ఞాపూర్ వరకు సుమారు వెయ్యి ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో తాము రోడ్డున పడ్డామన్నారు. ఆటోకార్మికుల కుటుంబాలకు భద్రత కల్పిస్తూ ఒక్కో ఆటోకార్మికుడికి నెలకు రూ.15వేల జీవనభృతి కల్పించాలన్నారు. బస్సు డ్రైవర్లుగా, హెల్పర్లుగా ప్రైవేట్ సంస్థల్లో పనిచేసిన వారు ప్రస్తుతం ఆటోకార్మికులుగా జీవనం వెల్లదీస్తున్నారని, అలాంటి వారికి ఆర్టీసీల్లో తగిన ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటోకార్మికుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో ఉద్యమిస్తామన్నారు.

## యువత డ్రగ్స్ బారిన పడొద్దు

- కేంద్రప్రభుత్వ డిప్యూటీ కమిషనర్ (సీబీఐసీ) వెంకదేశ్‌బాబు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 29 : యువత మాదక ద్రవ్యాల బారిన పడొద్దని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ కమిషనర్ (సీబీఐసీ) వెంకదేశ్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని విపంచి కళానిలయంలో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం, నివారణ, యువతపై ప్రభావం తదితర విషయాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలామంది యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కేంద్రప్రభుత్వ డిప్యూటీ కమిషనర్ (సీబీఐసీ) వెంకదేశ్‌బాబు

## పత్తి వ్యాపారుల నుంచి రూ.3.10లక్షల వసూలు




చెరాగ్‌పల్లి 65వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పన్నులు వసూలు చేస్తున్న ఇబ్బంది

జహీరాబాద్, డిసెంబర్ 29 : పత్తి వ్యాపారుల మాయాజాలంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ నెల 23న 'నమస్తే తెలంగాణ'లో 'పత్తి వ్యాపారుల మాయాజాలం' అనే వార్త ప్రచురితం కాగా, జిల్లా అధికారులు వెంటనే స్పందించిన మార్కెట్ లైసెన్స్‌లు లేని వ్యాపారులను గుర్తించి నోటీలు జారీ చేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌బాబు జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలంలో లైసెన్స్‌లు లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న 9మందికి నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర సరిహద్దులో 65వ జాతీయ రహదారిపై మార్కెట్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి రూ.3.10 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. పత్తి వ్యాపారులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్కెట్ ఫీజు చెల్లించకుండా అక్రమంగా ఇతర రాష్ట్రాలకు పత్తి తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా జూనియర్ నెట్‌బాల్ జట్టు క్రీడాకారిణులతో పీఈటీలు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 29 : ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ జట్టును శుక్రవారం గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ విజయరేఖ తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ క్రీడాపోటీలు జరగనున్నాయని, ఎంపికైన జూనియర్ బాలికలు, బాలుర జట్లు ఈ క్రీడాపోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు దేవరాజ్, సందీప్, కిరణ్ పాల్గొన్నారు.